# గోదావరీ పుష్కరాల సంక్షిప్త పరిచయం

## (అనుబంధంలో - పుష్కరస్నాన విధానం)

సంకలనం
“వాచస్పతి” “సంస్కృత మిత్ర”

**డా॥ రేమెళ్ళ అవధానులు**

M.Sc.(Nuclear Physics), M.A., Ph.D.(Sanskrit), M.A., Ph.D.(Jyotisha)
Dy. Director(Computers), (Retd)., NIMS, Hyderabad.

**శ్రీ వేదభారతి**

**హైదరాబాద్**

**2015**

# గోదావరీ పుష్కరాల సంక్షిప్త పరిచయం

## డా॥ రేమెళ్ళ అవధానులు

కాపీరైట్ : శ్రీ వేదభారతి

ప్రథమ ముద్రణ : 2015

వెల : రూ. **40/-**

ప్రతులకు : **శ్రీ వేద భారతి**

"H" Block-34, Madhuranagar,
Hyderabad-500 038.
Ph. : 040-23812577
Cell : 098494 59316
shrivedabharathi@gmail.com
www.shrivedabharathi.in

ముద్రణ :

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | 4 |
| పుణ్యభూమి మనదేశం | 7 |
| పుష్కరుడు అంటే ఎవరు? | 12 |
| గోదావరీ పుష్కరాలు ఎప్పుడు వస్తాయి? | 16 |
| గోదావరీ నది పుట్టుక కథ | 17 |
| గోదావరీ నది భౌతిక విశేషాలు | 18 |
| పుష్కర కాలాల్లో మన కర్తవ్యాలు | 22 |
| జీవోత్పత్తి, పితృదేవతల అనుగ్రహం | 22 |
| వేద సిద్ధాంతం - లౌకిక సమన్వయం | 23 |
| ముక్తి-ఋణవిముక్తి | 24 |
| జన్మజన్మల మన అభ్యుదయానికి మూలాలు | 25 |
| భగీరథుని కృషి - సమాజ సౌభాగ్యం | 26 |
| శ్రీరాముని ఆదర్శం | 26 |
| ధర్మం యొక్క ప్రాధాన్యత-పుష్కరాల్లో విశేష ధర్మాలు | 27 |
| పుష్కర దానాలు | 29 |
| గోదావరీ పుష్కర మాహాత్మ్యాన్ని వర్ణించే కథలు | 32 |
| పుష్కరాలు మనకు అందించే సందేశం | 39 |
| క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగివద్దాం! | 41 |
| అనుబంధం : పుష్కరస్నాన విధానము | 43 |
| ఉపయుక్త వ్యాసాల రచయితలు | 58 |

# ముందుమాట

పుష్కరాలు భారతీయులకు భాగ్యవశమున వచ్చే గొప్ప అవకాశం. ఈ సమయంలో తమ తమ శక్తికి, అర్హతకు తగినట్లు ధర్మాన్ని ఆచరించాలి.

పవిత్రత పరమాత్మ లక్షణం! పవిత్రమైన నదీ తీర్థ క్షేత్రాలు భగవన్నివాసాలు! వాటిని సేవించడం భగవంతుని సేవించడమే! అరణ్యవాస సమయంలో శ్రీరాముడు, ధర్మరాజు, వారివారి పరివారాలు తీర్థాలు, క్షేత్రాలు దర్శించినట్లు మన ఇతిహాసాల్లో ఉంది.

వైదికమార్గాన్ని బోధించే ఋషి వాక్యాలను, ఆ ఋషులు విశ్వసించి, ఆచరించిన ధర్మాన్ని అనుసరించడమే మన జీవిత కర్తవ్యమని పెద్దలు బోధించారు.

## గోదావరీ పుష్కరాల సమయం

గురువు అనే గ్రహం ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క సంవత్సరం ఉంటూ ఉంటుంది. 12 రాశుల్లోను ప్రయాణిస్తూ ఉంటుంది. ఆ ప్రయాణంలో, సింహరాశిలో ప్రవేశించినపుడు గోదావరీ పుష్కరాలని, కన్యారాశిలో ప్రవేశించినపుడు కృష్ణా పుష్కరాలని పేర్కొంటారు. ఆ రాశిలో ఉన్న సమయంలోని మొదటి 12 రోజులను ఆది పుష్కరమని, చివరి 12 రోజులను అంత్య పుష్కరం అంటారు.

## పుష్కర కాలాల్లో కర్తవ్యాలు

పుష్కర సమయాలలో నదీజలాలు దేవతలయొక్క తేజస్సును పొంది ఉంటాయి. కాబట్టి ఆ సమయాలలో మానవులు స్నానం, దానం, జపం, అర్చన, ధ్యానం, హోమం, తర్పణం మొదలైన అనుష్ఠానాలను, పితృదేవతలకు పిండ ప్రదానాలను చేయాలని మహర్షులు ప్రబోధించారు. ఆధ్యాత్మిక సాధనలకు, మోక్ష లక్ష్యానికి భారతీయ సంస్కృతి ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తుంది.

## కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ శ్రీమతి వై.వి. అనురాధ, ఐ.ఎ.ఎస్.గారిని గత 2014 అక్టోబరు మాసంలో సందర్శించడం జరిగింది. ఆ సందర్భంలో శ్రీ వేదభారతి గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వేదశబ్ద పరిరక్షణ, వేద విజ్ఞా ప్రచారములను గురించి పరిచయం చేస్తూ, శ్రీ వేదభారతి  ప్రచురించిన గ్రంథాలను వారికి బహూకరించడం జరిగింది. ఆ సమయంలో, "రాబోయే గోదావరీ పుష్కరాలకు సంబంధించికూడా ఒక చిన్నపుస్తకాన్ని ప్రచురిస్తే బాగుంటుంద"నే అభిప్రాయాన్ని వారు వ్యక్తం

చేశారు. వారి సూచనను ప్రేరణగా గ్రహించి ఈ చిన్ని పుస్తకాన్ని సంకలనం చెయ్యడం జరిగింది. సామాజిక ప్రయోజనాన్ని సాధించే చక్కటి ఆ సూచనను అందించి నందులకు వారికి **మా హృదయపూర్వక కృతజ్ఞతలు** తెల్పుకొంటున్నాము.

పుష్కరం అంటే ఏమిటి? ఆ సమయంలో ఏమి చేయాలి? అనే విషయాలను చాలామందికి సంక్షిప్తంగా తెలియజేయడమే ఈ పుస్తకం యొక్క ప్రయోజనం. ఇంకా అదనపు వివరాలు కావాలనుకొనేవారు పండితులను సంప్రదించగలరు.

పుష్కర విధుల నిర్వహణలో శ్రద్ధ, భక్తి, విశ్వాసము అత్యంత కీలకమయినవి. అతి పవిత్రమైన గోదావరీ పుష్కరాల ధార్మిక కార్యక్రమాలలో పై విధంగా ఆచరించి తరించ వలసిందిగా ప్రార్థన. ఆ మార్గంలో ఈ చిన్ని పుస్తకం కొంతమేరకైనా ఉపయోగిస్తుందని విశ్వసిస్తున్నాము.

**డా॥ రేమెళ్ళ అవధానులు**

ది. 14-12-2014 'శ్రీ వేదభారతి' వ్యవస్థాపక అధ్యక్షులు

# గోదావరీ పుష్కరాలు

## పుణ్యభూమి మనదేశం

ఈ భూమండలంలో భారతభూమి ధర్మభూమిగా, కర్మభూమిగా పేరు పొందింది. భగవంతుడు ఎన్నో అవతారాలనెత్తి, తన పరిపూర్ణానుగ్రహాన్ని ప్రకటించిన భూమి ఇది. వివిధ రంగాలలో పరిపూర్ణతను సాధించిన సాధుజనులు పుట్టి పెరిగిన భూమి ఇది. చదువు సంధ్యలతో సంబంధం లేకుండా, మన సంస్కృతిని, సంస్కారాలను కీర్తి శిఖరాలకు జేర్చిన ఎందరో త్యాగమూర్తులు జీవించిన పుణ్యభూమి ఇది.

## పుణ్యనదులు

భూదేవిని సకల జీవజాతికి తల్లిగా భావిస్తారు. దివ్యమంగళ విగ్రహమైన తల్లిగా భరతమాతను కొలుస్తాం. తమను ఆశ్రయించుకొనినవారిని రక్షించి, అన్నంపెట్టి ఆదుకునే నదీమతల్లులన్నింటినీ ప్రతిరోజూ స్మరిస్తాం.

**గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।**
**నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥**

గంగ, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ మొదలైన పవిత్ర నదులను స్మరిస్తూ స్నానం చేస్తే, పవిత్రమైన అన్ని

నదులలోను స్నానం చేసినట్లే అని తలుస్తూ కోట్లాదిమంది స్నాన సమయంలో ఈ శ్లోకాన్ని పఠిస్తూ ఉంటారు.

## పుణ్యనదులతో అనుబంధం

మానవ జీవనానికి, జీవనదులకు విడదీయలేని బంధం ఉంది. కన్యాకుమారి నుండి కాశ్మీరు వరకు ఉన్న భారతీయ పుణ్య నదులను సందర్శిస్తే, ఎన్నో అద్భుత చరిత్రలు, అనుభవాలు, అనుభూతులు, సాక్షాత్కారాలు మనకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ఆ కోవలోకి చెందినవే మన గోదావరీ, కృష్ణా, తుంగభద్రా మొదలైన మహా నదుల పుష్కరాలు.

దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలనెదుర్కొంటూ జీవిత పరమార్థమైన మోక్షాన్ని జేరడానికి నిత్యమూ శ్రమించలేని మానవులకు మన మహర్షులు కనుగొనిన అత్యంత దివ్య సాధనమే పుణ్యనదీస్నానాలు.

భగవంతుడు అంతటా ఉన్నా, అన్ని కాలాల్లోను, అందరిలోనూ ఉన్నా, పొదుగులోనే ఆవుపాలు లభిస్తున్నట్లు, కొన్నిచోట్ల, కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆయన సాన్నిధ్యం ఎక్కువగా లభిస్తుంది. పర్వకాలాల్లో నదీ స్నానాలు ఆ కోవకు చెందినవి.

## పుష్కర స్నానాలు ఎందుకు చెయ్యాలి?

పుణ్యనదీ స్నానాదులకు బయలుదేరి వెళ్ళడం ద్వారా, సామాజిక దృష్టి వృద్ధి పొంది, స్వార్థాన్ని కొంతవరకైనా తగ్గించుకొని, సర్వాంతర్యామియైన భగవంతుణ్ణి సేవించుకునే సంస్కారం ఏర్పడుతుంది.

భగవంతుని అనుగ్రహం వర్షరూపంలో భూమికి చేరుతుంది. పలుచోట్ల కురిసిన వర్షాలు చిన్న చిన్న సెలయేరులై, ప్రవాహములై, ఉపనదులై, నదులై, మహానదులై ఈ భూమిని సస్యశ్యామలం చేస్తున్నాయి. అసంఖ్యాకమైన ఓషధుల మీదుగా ప్రవహించి, అవి ఔషధ జలాలుగా మారతాయి. నిత్యమూ లోక క్షేమాన్నే కోరుకుంటూ, వేదాలను ఉపాసిస్తూ, యజ్ఞ యాగాదులను నిర్వహించుకొనే మహర్షులను సేవించుకొని అవి దివ్యత్వాన్ని పొందుతున్నాయి. ఆ జలాలలో స్నానం చేయడం మూలంగా, మన పాపాలు పోయి, పవిత్రమైన వాళ్ళము అవుతాము. పుష్కరాల సమయంలో ఆ నదుల్లో స్నానం చెయ్యడం మూలంగా ఇంకా ఎక్కువ పవిత్రతను పొందుతాము. పవిత్రమైనవాడు చేసే ఏ పనైనా మంచి ఫలితాలనే ఇస్తుంది. ఆ సమయంలో మనం ఇచ్చే తర్పణాలు కీర్తిశేషులైన మన తల్లిదండ్రులను, ఇంకా అంతకు ముందు తరాలవారిని తరింపజేసి, పుణ్యలోకాలను పొందిస్తాయి. అందుకే పుష్కర స్నానాలు చెయ్యాలి.

**నదుల పవిత్రతను వర్ణించే గ్రంథాలు**

యాపిల్ వంటి కొన్ని ఫలవృక్షాలు, కుంకుమపువ్వు వంటి కొన్ని పుష్పవృక్షాలు కొన్నిచోట్ల మాత్రమే పెరుగుతాయి. అది ఆ మట్టికి, ఆ వాతావరణానికి ఉన్న ప్రత్యేకత! వేలాది నదులు ఉన్నా, పవిత్రతనూ పుణ్యాన్ని ఇచ్చేవి కొన్ని నదులు మాత్రమే! అది వీటి ప్రత్యేకత!

భూమియొక్క, దానిమీద ప్రవహిస్తున్న నదులయొక్క, వాటి తేజస్సు యొక్క, మహోగ్ర తపస్సంపన్నులైన మహామునుల యొక్క సాంగత్యంతో, తీర్థాలు, క్షేత్రాలు అత్యంత పుణ్యతమములు అయ్యాయి అని పద్మ పురాణంలో ఉంది.

**ప్రభవాదద్భుతాద్భూమేః సలిలస్య చ తేజసా ।**
**పరిగ్రహాన్మునీనాం చ తీర్థానాం పుణ్యతా స్మృతా ॥**

ఈ విధమైన నదుల పవిత్రతను గూర్చిన వచనాలు వేదాలలోను, స్కాంద పురాణ, నారద పురాణ, మహాభారతంలోను ఇంకా అనేక గ్రంథాల్లోను కోకొల్లలుగా లభిస్తున్నాయి.

**జలం యొక్క పవిత్ర శక్తులు**

జలానికి ఉన్న లౌకికశక్తి – మురికిని పోగొట్టడం, దాహాన్ని తీర్చడం – ఇది అందరికీ తెలిసిందే. ఇదిగాక, ఒక

దేవతాశక్తి కూడా ఉందని వేదం చెబుతోంది. ఆది రెండు రకాలు – మేధ్యం, యజ్ఞ్యం అని.

అందులో మేధ్యం అనే శక్తి స్నానం, ఆచమనం మొదలైన వాటి ద్వారా మన పాపాన్ని తొలగిస్తుంది. రెండవశక్తి (యజ్ఞ్యం) నీళ్ళు జల్లడం (ప్రోక్షణం) వంటి క్రియల ద్వారా వస్తువులను పవిత్రం చేస్తుంది. పుష్కర స్నానం ఈ దేవతా శక్తిని వృద్ధిచేసి మనలను కాపాడుతుంది.

ఈ ప్రపంచం మహాశక్తి స్వరూపం. అందులో అనేక శక్తులున్నాయి. ఆ శక్తులలో జలం ఒకటి. పవిత్ర జలానికి పుష్కరం అని పేరు ఉంది. "పోషయతీతి పుష్కరః – పోషిస్తుంది కనుక పుష్కరం" అన్నారు. పుష్కలత్వాన్ని కలిగించేది పుష్కరం.

## పర్వకాలాలు – పుష్కరాల ప్రాధాన్యత

పర్వం అంటే కణుపు అని అసలు అర్థం. రెండు ప్రత్యేక కాలాలకు మధ్యలో సంధిలాంటి పవిత్ర కాలాన్ని పర్వమని అంటారు. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం ప్రతి నెలలోను రవి సంక్రమణ దినం (సూర్యుడు ఒక రాశినుండి ఇంకొక రాశిలోకి ప్రవేశించే రోజు), పౌర్ణమి, కృష్ణపక్ష అష్టమి, కృష్ణపక్ష చతుర్దశి, అమావాస్య–ఈ అయిదింటిని పంచపర్వాలు

అంటారు. ఇవిగాక సూర్యగ్రహణ సమయం, చంద్రగ్రహణ సమయం కూడా పర్వకాలాలే.

ధార్మిక ప్రవృత్తిగల భారతీయులకు పర్వకాలాలు చాలా ఉన్నాయి. అందులో నదీ పుష్కరాలు ఇంకొక ప్రధానమైన పర్వకాలం.

**పుష్కరుడు అంటే ఎవరు? పుష్కరాల సమయంలో ఏ దేవతలు వస్తారు?**

పూర్వం తుందిలుడనే మహర్షి ఉండేవాడు. ఆయన చాలాకాలం పరమేశ్వరుణ్ణి ఆరాధించాడు. ఆయన దయవలన 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలకు రాజై, పుష్కరుడు అనే ప్రసిద్ధిని సంపాదించాడు. ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలమయ మూర్తిలో స్థానాన్ని సంపాదించాడు.

**పుష్కరునికి, బ్రహ్మకు సంబంధం**

ఒకప్పుడు బ్రహ్మ తన తపస్సుతో పరమేశ్వరుణ్ణి సంతోషింపజేసి, అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుణ్ణి తన సృష్టికార్యంలో సహాయంగా ఉండటానికి తనకిమ్మని అడిగాడు. అలాగే అన్నాడు ఈశ్వరుడు. జలరూపంలో ఉన్న పుష్కరుణ్ణి తన కమండలంలో పెట్టుకొని బ్రహ్మ సృష్టి చేస్తున్నాడు.

**పుష్కరునికి, గురునికి (బృహస్పతికి) సంబంధం**

దేవతలకు గురువు బృహస్పతి. ప్రాణులను బ్రతికించడం అతని ధర్మం. అందుకే జ్యోతిషంలో గురువుకు 'జీవ' అనే పేరు కూడా ఉంది. ప్రాణులను బ్రతికించడానికి జలాలు కావలసి ఉన్నాయి. దానికొఱకు బృహస్పతి బ్రహ్మను గూర్చి తపస్సు చేసి, పుష్కరుణ్ణి తన అధీనంలో ఉంచమని ప్రార్థిస్తాడు. అయితే, పుష్కరునికి బ్రహ్మను విడిచి ఉండడానికి ఇష్టంలేక, బ్రహ్మనుకూడా తనతో బృహస్పతివద్ద ఉండ వలసిందిగా ప్రార్థిస్తాడు. అందుకు బ్రహ్మ ఒక ఏర్పాటు చేశాడు.

గ్రహస్వరూపుడైన బృహస్పతినే గురుడు, లేక గురువు అని కూడా అంటారు. ఇది మేషం, వృషభం మొదలైన 12 రాశులలో, ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క సంవత్సరం చొప్పున ఉంటూ, ముందుకు ప్రయాణిస్తూ ఉంటుంది. బృహస్పతి ప్రతి రాశిలోను ప్రవేశించే సందర్భంలో, మొదటి 12 రోజులు పుష్కరుడు బృహస్పతితో ఉండాలని ఏర్పాటు జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం పైన చెప్పిన పుష్కర కాలాల్లో పుణ్యతీర్థాలకు అధిపతియైన పుష్కరుడు బృహస్పతితో ఆయా నదుల్లో నివసిస్తాడు.

ఈ పవిత్ర సమయంలో పుణ్యఫలం మీద అపేక్ష కొద్దీ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, ఇంద్రాది దేవతలు, సమస్త

ఋషులు, పితృదేవతలు, పర్వకాలం దాటేంతవరకు పుష్కర స్థానంలో నివాసం ఏర్పాటు చేసుకుంటారు. వీరితోబాటు పుష్కర సమయంలో భూమండలంలోని సమస్త పుణ్యతీర్థాలేగాక, ఇతర లోకాల్లోని పవిత్రతీర్థాలన్నీ ఆ నదిలో చోటు చేసుకుంటాయి.

అంతమంది దేవతల సాన్నిధ్యం వలన ఆ నదుల్లో చెప్పలేనంత ప్రభావం ఉంటుంది. ఆ సమయాల్లో శాస్త్రాలలో చెప్పబడిన ధర్మాలను ఆచరిస్తే, చెప్పలేనంత ఫలం లభిస్తుంది.

## జ్యోతిశ్శాస్త్రం ప్రకారం పుష్కరాలు

అనేక జ్యోతిర్మండలాలతో విరాజిల్లే ఈ విశ్వం అనేక దేవతామూర్తులచే రక్షించబడుతోంది. అది మన పురాణాల్లోని వర్ణనల ప్రకారం, ఒక చక్రరూపంలో పరిభ్రమిస్తూ ఉంటుంది. దానిని శింశుమారచక్రమని అంటారు. ఇందులోని ఒక చిన్న భాగంలో అశ్విని, భరణి మొదలైన 27 నక్షత్ర మండలాలు ఉన్నాయి. ఒక్కొక్క నక్షత్ర మండలాన్ని 4 పాదాలుగా విభజించగా, మొత్తం 108 నక్షత్ర పాదాలు ఏర్పడ్డాయి. వీటిలోని తొమ్మిదేసి పాదాలను ఒక రాశి చొప్పున విభజించగా, 12 రాశులు ఏర్పడ్డాయి. ఈ రాశుల ఆకారాలను బట్టి వీటికి మేషం (మేకపోతు), వృషభం (ఎద్దు) మొదలైన పేర్లు ఏర్పాటు

చేశారు. ఈ 12 రాశులు శింశుమారచక్రంలోని ఒక భాగం. మనుష్యమానాన్ని అనుసరించి, బృహస్పతి ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క రాశి చొప్పున సమస్త దేవతలతో కూడి, ఒక్కొక్క నదిని ఆశ్రయించుకొని, ఈ రాశిచక్రంలో పరిభ్రమిస్తూ ఉంటాడు. సూర్యుడు కేంద్రంగా, మొత్తం రాశిచక్రాన్ని పూర్తిగా ఒకసారి చుట్టిరావడానికి గురునికి 12 సంవత్సరాలు పడుతుంది. ఈ **12 సంవత్సరాలకాల విభాగాన్ని పుష్కరం** అంటారు.

**పుష్కర నదులు**

గురుడు నివసించే 12 నదులను పుష్కర నదులు అని పేర్కొంటారు. ఒక్కొక్క నదిలో గురుడు ప్రవేశించినది మొదలు, పుష్కరుడు ఉండే మొదటి **12 రోజుల సమయాన్ని కూడ పుష్కరములు** అంటారు. ఈ సంబంధం మూలంగా, **పుష్కరం అంటే పవిత్రమైన నదీజలములు** అని అర్థం కూడ ఏర్పడింది. ఈ పుష్కర జలముల యొక్క దర్శనం, స్పర్శనం, స్నానం, పానం చేసినచో పంచ మహాపాతములు, ఉపపాతకములు పోతాయి. శారీరక వ్యాధులు, మానసిక వ్యాధులు, ప్రారబ్ధ జన్యవ్యాధులు నిర్మూలింపబడతాయి. పితృదేవతలకు ముక్తి ప్రదములవుతాయి. రాశులకు నదులకు ఉన్న పుష్కర సంబంధాన్ని ఈ క్రింది విధంగా అందించారు.

| ప్రవేశ రాశి | - | పుష్కర నది |
|---|---|---|
| మేషం | - | గంగానది |
| వృషభం | - | నర్మద |
| మిథునం | - | సరస్వతి |
| కర్కాటకం | - | యమున |
| సింహం | - | గోదావరి |
| కన్య | - | కృష్ణ |
| తుల | - | కావేరి |
| వృశ్చికం | - | భీమరథి |
| ధనుస్సు | - | వాహిని (బ్రహ్మపుత్ర) |
| మకరం | - | తుంగభద్ర |
| కుంభం | - | సింధు |
| మీనం | - | ప్రణీతానది |

**గోదావరీ పుష్కరాలు ఎప్పుడు వస్తాయి**

గురుడు సింహరాశిలోకి ప్రవేశించి ఒక సంవత్సరం ఉంటాడు. ఆ ప్రవేశ సమయంలో గోదావరీ పుష్కరాలు ప్రారంభ మవుతాయి. మొదటి 12 రోజులను ఆది పుష్కరం అంటారు. గురుడు సింహరాశిలో ఉన్నకాలంలోని ఆఖరి 12 రోజులను అంత్య పుష్కరం అంటారు.

## గోదావరీ నది పుట్టుక కథ

దక్షిణ భారతదేశంలోని నదులలో అన్నింటి కంటే పెద్ద నది గోదావరీ నది. ఈ నది యొక్క పుట్టుకను గురించి ఒక కథ ఉంది. గౌతమ మహర్షి మహాతపస్వి. అన్నదానంలో అతనికి అతనే సాటి. కరువు సమయాలలో కూడ తన తపశ్శక్తితో వేలాదిమంది మహర్షులకు నిత్యాన్నదానం చేస్తూ ఉండేవాడు. గంగానదిని దక్షిణ భారతదేశానికి పంపించాలని కొందరు దేవతలు భావించారు. వారు ఒక గోవుని తయారు చేసి, గౌతముని పొలాల్లో పంటను తింటున్నట్లుగా ఒక మాయను జేశారు. ఆ గోవును గౌతముడు ఒక దర్భ పుల్లతో అదలించగా వెంటనే అది మరణించిందట. గౌతముడు గోహత్య చేశాడని నిందిస్తూ, మహర్షులు అందరూ గౌతమ ఆశ్రమం నుండి వెళ్ళిపోయారు.

గోహత్యా దోష నివారణకు గౌతముడు తపస్సు చేసి శివుని మెప్పించాడు. శివుడు తన జటను ఒకదానిని పిండగా, దాని నుండి జలము వెలువడింది. ఆ జలం చేత గోవు జీవించింది. గోవుకు పునర్జన్మను ఇచ్చింది కనుక గోదావరి అయింది. గౌతమునిచే తేబడింది గనుక గౌతమి అయ్యింది. శివుని జటాజూటంలోని గంగలోని ఒక భాగం దక్షిణ భారతంలో ప్రవహించింది గనుక దక్షిణ గంగ అయ్యింది.

నన్నయ్యభట్టు ఆంధ్ర మహాభారతంలో గోదావరీనదిని **దక్షిణ గంగ** అని ప్రశంసించాడు.

## గోదావరీ నదికి పెరిగిన పవిత్రత

సీతారామలక్ష్మణులు గోదావరీ నదీ తీరంలో పంచవటిలో సుమారు 10 సంవత్సరాలు నివసించారు. సీతాదేవి స్నానం చేయడం మూలంగా గోదావరీ జలాల పవిత్రత మరింత ఇనుమడించిందని కాళిదాసు మేఘసందేశ కావ్యంలో మొదటి శ్లోకంలో **"జనక తనయా స్నాన పుణ్యోదకేషు"** అనే వచనం ద్వారా వర్ణించాడు.

## గోదావరీ నది భౌతిక విశేషాలు

దక్షిణ భారతదేశంలో ఉన్న నదులలో గోదావరి మిక్కిలి పెద్దది. గోదావరి నది మహారాష్ట్రంలోని నాసిక్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలోని త్ర్యంబక్ గ్రామానికి చేరువగా ఉన్న బ్రహ్మగిరిలో ఉదయించింది. ఆ కొండపై గోదావరికి చెందిన నీటి బిందువులు మొదటగా కలిసే ప్రదేశాన్ని **"గంగాద్వార్"** అని పిలుస్తారు. ఇది పశ్చిమ సముద్ర తీరానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడనుండి మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 1400 కిలోమీటర్ల దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో

కలుస్తోంది. ఈ మధ్యలో 'మంజీర – మానేరు – ప్రాణహిత– ఇంద్రావతి–శబరి'' అనే పంచ నదులు గోదావరిలో కలుస్తున్నాయి. బాలాఘాట్ కొండలలో పుట్టిన "మంజీరానది" మెదక్, నిజామాబాద్ జిల్లాలలో ప్రవహించి, గోదావరిలో కలుస్తుంది. కరీంనగర్ జిల్లా సిరిసిల్లా కొండలలో పుట్టిన ''మానేరు నది'' మహాదేవపురం వద్ద కలుస్తుంది. "ప్రాణహితనది" ఆదిలాబాదు జిల్లాలో గల చిన్నూరు వద్ద కలుస్తుంది. ఈ ప్రాణహిత నది ఒక నదిమాత్రము కాదు "వార్ధా–పెన్‌గంగ–నయన్ గంగ" యీ త్రివేణీ సంగమమే ప్రాణహిత నది. ఆ తరువాత "ప్రాణహిత"కు సుమారు 45 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం తాలూకా సరిహద్దులు చుట్టి వచ్చిన 'ఇంద్రావతి'యు, అక్కడికి 140 కిలోమీటర్ల దూరంలో రేకపల్లి కొండలను చుట్టివచ్చిన "శబరి" చేరుటతో పడమటి కనుమలలో పుట్టిన పిల్ల గోదావరి తల్లిగోదావరిగా, అఖండ గోదావరిగా రాజమహేంద్రవరానికి చేరుతోంది.

## సప్త గోదావరులు

సప్తర్షుల ప్రార్థన మేరకు ఈ అఖండ గోదావరి ఏడు పాయలుగా చీలి సముద్రంలో కలుస్తోంది. ఆ ఏడుపాయలను సప్తగోదావరులు అంటారు. అవి ఈ విధంగా ఏర్పడ్డాయని అంటారు.

1. **తుల్యభాగ** – దీనిని జమదగ్ని మహర్షి ధవళేశ్వరము నుండి తీసుకుపోయి చొల్లంగి వద్ద సాగరమును చేర్చాడు.
2. **ఆత్రేయ** – దీనిని అత్రిమహాముని కపిలేశ్వరపురము నుండి తీసుకుపోయి కోటిఫలి (కోటిపల్లి) మీదుగా కోరంగి వద్ద చేర్చాడు.
3. **భరద్వాజ** – దీనిని భరద్వాజమహర్షి కపిలేశ్వరపురము నుండి తీసుకుపోయి కోటిఫలి మీదుగా తీర్థాలమొండి వద్ద చేర్చాడు.
4. **గౌతమి** – గౌతమ మహర్షి త్ర్యంబకగిరి నుండి తెచ్చి బ్రహ్మ సంవేద్యము (తీర్థాలమొండి) వద్ద సాగరునితో కలిపాడు.
5. **వృద్ధ గౌతమి**– వామదేవుడను మహర్షి ముక్తేశ్వరము నుండి ఈ పాయను తీసుకొని తీర్థాలమొండి వద్ద చేర్చాడు. ఈ మహర్షికి కశ్యప, కాణ్వ అని నామాంతరములు ఉన్నాయి.
6. **కౌశిక** – విశ్వామిత్రుడు మందపల్లి నుండి ఈ పాయను తీసుకుపోయి బెండమూర్లంక వద్ద సాగరంతో కలిపాడు.
7. **వసిష్ఠ** – వసిష్ఠ మహర్షి విజ్జేశ్వర ప్రాంతము నుండి ఈ పాయను తీసుకుపోయి అంతర్వేది వద్ద సాగరునితో కలిపాడు.

## తీర్థ క్షేత్రాలు

జ్యోతిర్లింగ క్షేత్రమైన త్ర్యంబకం, నాసిక్, బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం, పట్టిసం, రాజమండ్రి, ధవళేశ్వరం, పలివెల, కోటిపల్లి, దక్షారామం, కొవ్వూరు, వాడపల్లి, పాలకొల్లు, మొదలైన ప్రసిద్ధ క్షేత్రాలు గోదావరి నది ఒడ్డున ఉన్నాయి.

ఇక్కడ ముక్తీశ్వర, కాళేశ్వర, భీమేశ్వర, కోటిలింగేశ్వర, మార్కండేశ్వర, కొప్పేశ్వర, కమండలేశ్వర, కుండలేశ్వరాది నామధేయాలతో చాలా శైవ క్షేత్రాలు ఉన్నాయి. ఇవిగాక, భద్రాచలంలో రామదాసు కృషిచేత జగత్ప్రసిద్ధమైన సీతారామ లక్ష్మణులు, ర్యాలి గ్రామంలో వెలసిల్లిన శ్రీ జగన్మోహినీ కేశవస్వామి, ధర్మపురిలోను, సాగర సంగమస్థానమైన అంతర్వేదిలోను వెలసిల్లిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి, మొదలైన ఎన్నో వైష్ణవ క్షేత్రాలు కూడా ఉన్నాయి. రాజమండ్రిలోని కోటిలింగాల రేవు, పుష్కరాల రేవు, కొవ్వూరులోని గోపాదాల రేవు, అప్పనపల్లి, రాజోలు వంటి గ్రామాల్లోని స్నానఘట్టాలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి.

మంథని, ధర్మపురి, పొడగట్లపల్లి, కపిలేశ్వరపురం, ముక్కామల మొదలైన గ్రామాలు, శ్రీరామపురం, గంగలకుర్రు, మొదలైన అనేక అగ్రహారాలు వేదవిద్యకు స్థానాలుగా,

శతాబ్దాలుగా ప్రఖ్యాతి గడించాయి. వీటన్నింటితోబాటు చాలాచోట్ల అన్నదాన సత్రవులు కూడా గోదావరీ తీరాలలో శతాబ్దాలుగా విలసిల్లాయి.

**పుష్కర కాలాల్లో మన కర్తవ్యాలు**

పుష్కర సమయాలలో నదీజలాలు దేవతల తేజస్సును పొంది ఉంటాయి. కాబట్టి ఆ సమయాలలో మానవులు స్నానం, దానం, జపం, అర్చన, ధ్యానం, హోమం, తర్పణం మొదలైన అనుష్ఠానాలను, పితృదేవతలకు పిండ ప్రదానాలను చేయాలని మహర్షులు ప్రబోధించారు. ఆధ్యాత్మిక సాధనలకు, మోక్ష లక్ష్యానికి భారతీయ సంస్కృతి ఎక్కువ ప్రాముఖ్యాన్నిస్తుంది.

**జీవోత్పత్తి, పితృదేవతల అనుగ్రహం**

తల్లిగర్భం కర్మాగారం వంటిది. మనస్సు, బుద్ధి, ఇంద్రియ శక్తులు, జీవశక్తులు మొదలైనవి కర్మాగారంలో పనిచేసే టెక్నీషయన్ల వంటివాళ్ళు. దేహం, తల్లి గర్భంలో, కుండలాగా తయారుచేయబడుతుంది. దాన్ని తయారు చేసుకునేవాడు జీవుడు. తల్లి గర్భంలో జీవుణ్ణి పెంచే వారు పితృదేవతలు. వాళ్ళు చంద్రకిరణాలు, చంద్రకళలు ఆధారంగా చేసుకొని గర్భంలో పిండాన్ని నిర్మాణం చేస్తారు. జీవుడు దేహం విడిచినప్పటినుండి మళ్ళీ తల్లిగర్భంలో పడేలోపున

జరగవలసిన పరిశుద్ధి కొంత ఉంటుంది. ఆ పరిశుద్ధికి సంబంధించినవే పితృకర్మలు. ఈ సందర్భంలో మనకు **మాతృదేవోభవ- పితృదేవోభవ** అనే వచనాల ద్వారా తల్లిదండ్రులయెడల మన కృతజ్ఞతను ఎట్లా తెలుపుకోవాలో వేదం తెలియజేసింది.

ఈ కార్యక్రమాల యెడల అశ్రద్ధ చేయకూడదని కూడా వేదం చెప్పింది- **"దేవ పితృ కార్యాభ్యాం న ప్రమదితవ్యమ్"** అనే వచనం తైత్తిరీయ ఉపనిషత్తులో ఉంది.

**వేద సిద్ధాంతం - లౌకిక సమన్వయం**

మనకు భౌతిక శరీరంతోబాటు, సూక్ష్మ శరీరం, కారణ శరీరం కూడా ఉంటాయి. మనలో ఉండే ఈర్ష్యలు, అసూయలు, ఋణాదిభయాలు సూక్ష్మశరీరంలో ప్రవేశించి ఉంటాయి. భౌతిక దేహం విడిచిన తరువాత వీటిని వదల్చుకోవడానికి చేసే వైద్య క్రియల వంటివి పితృకర్మలు. నాలిక మీద మందు పడితే, మోకాలిలో ఉన్న నొప్పి తగ్గుతున్నట్లే, కర్మలు చేస్తే పూర్వకర్మదోషాలు తగ్గడం, తొలగడం జరుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. జీవించి ఉన్న ఒకరు భోక్తగా భోజనం చేస్తే గతించిన జీవునికి ఎట్లా అందుతుంది? ఇటువంటి అన్ని కుతర్కాలకు సమాధానా లున్నాయి. ఈ ప్రశ్నకు సమాధానం - మన పోస్టాఫీసులో

మనియార్డరు చేసి పోస్టువారికి డబ్బు అందిస్తే, మనం ఉద్దేశించిన వాళ్ళకు జేరుతూ ఉండడం అందరికీ అనుభవసిద్ధమే కదా!

**ముక్తి–ఋణవిముక్తి**

మానవుడు పుడుతూనే 3 రకాల ఋణాలతో పుడతాడు. అవి దేవ–ఋషి–పితృ–ఋణములు. మనకు విధించబడిన కర్మలను చేయడం ద్వారా ఋణము తీరిపోయి, ఋణ విముక్తుడవుతాడు. అపుడు ఆ జీవునికి మోక్షం పొందడానికి అర్హత పెరుగుతుంది.

**శ్రద్ధ ప్రధానం**

ఈ కర్మను చాలా శ్రద్ధగా చేయాలి గనుక శ్రాద్ధకర్మ అనే పేరు కూడ వచ్చింది. ఇది పితరుల ప్రేతత్వ విముక్తికి, పుణ్యలోక ప్రాప్తికి, బ్రతికి ఉన్న సంతతికి అవరోధాలు తొలగడానికి, వంశాభివృద్ధికి, శుభం జరగడానికి ఉపయోగిస్తుంది.

**శాస్త్ర విజ్ఞానం – మానవుని పురోగతి**

ఈ పితృకర్మలు చేయని వాళ్ళు జీవించుటలేదా? అందుచేత ఇవి అవసరమా? అని ప్రశ్నించే ప్రబుద్ధులకు ఎలక్ట్రిక్ లైట్లు, టెలిఫోన్లు, టి.వి.లు లేకపోతే మానవుడు

బ్రతకడా! ఇవి అవసరమా? అనే ప్రశ్నలే సమాధానాన్ని అందిస్తాయి. పై వస్తువులు లేకుండా యుగయుగాలుగా జీవిస్తూనే వచ్చారు. భవిష్యత్తులో కూడా తప్పక జీవించగలరు! కాని విజ్ఞానం సహాయంతో మరింత సుఖవంతంగా జీవించగలరు! అట్లాగే పితృకర్మల శాస్త్రవిజ్ఞానం కూడా జీవులు సుఖంగా జీవించడానికి ఉపయోగిస్తుంది. తెలిసిన విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనే మన గొప్పతనం ఇమిడి ఉంటుంది.

**వంశగౌరవాభివృద్ధి**

ఇంకొక విశేషం! పవిత్రమైన జీవితం గడిపిన మహానుభావులు దేహం వదలిన తరువాత, ఆ ఇంట్లో అదేవిధమైన పవిత్ర జీవితం తరువాతి తరాల్లో కొనసాగుతూ ఉంటే, తాము మరల అదే ఇంట్లో జన్మిస్తారుట! దానికి ఈ పితృకర్మలు ఎంతగానో ఉపయోగిస్తాయి.

**జన్మజన్మల మన అభ్యుదయానికి మూలాలు**

భౌతికవాదులు నదులను కేవలం జల ప్రవాహాలుగా భావిస్తారు. కాని అత్యంత ప్రాచీనమైన వేదవచనాలను బట్టి, సనాతన ధర్మాన్ని అవలంబించే వారందరూ ఈ నదులను దేవతలుగా భావిస్తారు. కారణం – మన బ్రతుకులు ఆ

నదులపైనే ఆధారపడి ఉన్నాయి కాబట్టి, బ్రతికి ఉన్నంత వరకే కాదు, చనిపోయిన తరువాత కూడా మనకు ఉత్తమ గతులు కలగడానికి చేసే ఉత్తర క్రియలన్నీ నదీ తీరాల్లోనే జరుగుతాయి!

దేహం విడిచిన తరువాత కూడా జీవుడు ఉంటాడని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. బల్బు మాడిపోతే విద్యుచ్ఛక్తి లేకుండా పోదు కదా!

## భగీరథుని కృషి – సమాజ సౌభాగ్యం

పాతాళ లోకంలో కపిల మహర్షి కోపాగ్నికి దగ్ధమయి, ఉత్తమ గతులు లేక బూడిద రూపంలో ఉండిపోయిన సగరపుత్రులు 60 వేల మందిని కారుణ్య దృష్టితో ఉద్ధరించి, స్వర్గానికి పంపించిన చల్లని తల్లి గంగమ్మ!

భగీరథుని కృషి, ముందుగా అతని పితరుల కొరకు ఉద్దేశించినా, అది యుగయుగాలుగా సమాజ సౌభాగ్యానికి ఉపకరిస్తూనే ఉంది. అప్పటినుండియే పుణ్యనదులకు, మన అభ్యుదయానికి సంబంధం ప్రారంభం అయ్యింది.

## శ్రీరాముని ఆదర్శం

దశరథుని మరణవార్తను వినిన తరువాత, అతనికి ఉత్తమగతులు కలగాలని రామలక్ష్మణులు గంగా నదిలో

స్నానం చేసినట్లు, పిండ ప్రదానాలు చేసినట్లు, తర్పణాలు వదిలినట్లు వాల్మీకి రామాయణంలో వివరింపబడింది. పుణ్యనదులలో ప్రతివారు పితృకర్మలు చేయడానికి ఇది ఒక ఆదర్శం అయ్యింది.

**బలరాముని తీర్థయాత్రలు**

కురుక్షేత్రంలో మహాభారత యుద్ధం జరుగుతూ ఉండగా, అందులో పాల్గొనుటకు ఇష్టంలేక, బలరాముడు తీర్థయాత్రలకు వచ్చి, సప్తగోదావరిలో స్నానం చేసినట్లు భాగవతంలో ఉంది.

ఇదేవిధంగా ధర్మరాజు, అర్జునుడు మొదలైన ఎందరో మహా పురుషులు పుణ్య నదులలో స్నానాలు చేసి, శాస్త్రాల్లో చెప్పినట్లుగా కర్మలనాచరించారు.

**ధర్మం యొక్క ప్రాధాన్యత – పుష్కరాల్లో విశేష ధర్మాలు**

శ్రేయస్సు కావాలనుకునే ప్రతివానికి ధర్మాన్ని అనుష్ఠించడమే సాధనము, పుష్కరాలలో చేయవలసిన ప్రక్రియలన్నీ ఆ ధర్మంలో భాగాలే. అందుచే పాపాలను తొలగించుకొని ఆనందాన్ని పొందాలనుకునే ప్రతివారూ ధర్మాన్ని అనుష్ఠించవలసిందే. ధర్మాచరణం వలన మిగతా సమయాల్లో సిద్ధించే ఫలితం కంటే, పర్వకాలాల్లో ఆచరించే ప్రతి కర్మకు ఫలం ఎన్నో రెట్లు ఉంటుంది.

ఈ కర్మలు ఆధ్యాత్మిక సంస్కారాన్ని పెంచుతాయి. అందుకే ఈ ధార్మిక కర్మలకు విశేష ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

**పుష్కర నియమాలు**

అవకాశం ఉన్నవారు పుష్కరవిధిని ఆచరించడానికి ముందురోజు రెండు పూటల్లో, ఒక పూట ఉపవాసం ఉండి, మరునాడు ఉదయం ముండనం (గుండు) చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధ, తర్పణాదులను ఆచరించడం ఉత్తమం.

**పుష్కరస్నాన విధానం**

పవిత్ర గోదావరీ పుష్కర సమయంలో పఠించవలసిన మంత్రాలు, శ్లోకాలు, వాక్యాలు చాలా ఉన్నాయి. అవకాశము ఉన్నవారు వరుణ, పవమాన, అఘమర్షణ సూక్తములను కూడా పఠిస్తూ మార్జనమొనరించాలి. పుష్కరస్నాన విధానాన్ని ఈ పుస్తకం చివర్లో అందించడం జరిగింది.

**పుష్కర తర్పణాలు**

ఈ పుష్కర దినాలలో ఆ నదికేగాక పుష్కరుడు, బృహస్పతి, బ్రహ్మ, నారాయణుడు, భాస్కరుడు మొదలైన దేవతలకు, ఇష్టదేవతలకు చెందిన మంత్రాలను జపించి, తర్పణాలు ఇవ్వాలని ప్రాచీన గ్రంథాలలో ఉంది.

**పుష్కర దానాలు**

ఈ క్రింది పట్టికలో సూచించినట్లు ఏ రోజున ఏ దానాలు చేయాలో కూడా తెలియజేశారు.

**చేయవలసిన దానముల వివరములు**

| | |
|---|---|
| 1వ రోజు | సువర్ణ, రజత, ధాన్య, భూదానాలు |
| 2వ రోజు | వస్త్ర, లవణ, ధేను, రత్న దానాలు |
| 3వ రోజు | గుడ (బెల్లం), అశ్వ, శాక, ఫలదానాలు |
| 4వ రోజు | ఘృత (ఆవునెయ్యి), తైల, క్షీర, మధు దానాలు |
| 5వ రోజు | ధాన్య, శకట, మహిషి, వృషభ, హల దానాలు |
| 6వ రోజు | ఔషధ, కర్పూర, కస్తూరి, చందన దానాలు |
| 7వ రోజు | గృహ, పీఠ, శయ్య, ఆందోళికా దానాలు |
| 8వ రోజు | చందన, పుష్పమాల, మూల ఆర్ద్రక (అల్లం) |
| 9వ రోజు | పిండ, దాసీ, కన్యా, కంబళ దానాలు |
| 10వ రోజు | శాక, సాలగ్రామ, పుస్తక దానాలు |
| 11వ రోజు | గజాది దానాలు |
| 12వ రోజు | తిల, అజ (మేక) దానాలు |

**పుష్కర దానాల ఫలాలు**

| | | |
|---|---|---|
| సువర్ణం, రజతం | – | ఈ లోకంలో సుఖభోగాలు, సూర్యచంద్ర లోక ప్రాప్తి. |
| భూదానం | – | భూపతిత్వం |

| | | |
|---|---|---|
| వస్త్రం | - | వసులోక ప్రాప్తి |
| గోదానం | - | రుద్రలోక ప్రాప్తి |
| ఆజ్య దానం | - | ఆయుష్యాభివృద్ధి |
| ఔషధ దానం | - | ఆరోగ్యం |
| సాలగ్రామ దానం | - | విష్ణులోకం |
| గృహదానం | - | చిరసౌఖ్యం |
| దాసీ, శయ్య | - | స్వర్గసుఖం |
| తిలదానం | - | ఆపదలు తొలగుతాయి |

ముత్తైదువులకు వాయనం ఇవ్వమని కూడా చెప్పబడింది. ఇదిగాక ఆ రోజుల్లో పుష్కరవ్రతం ఆచరిస్తే, అపమృత్యువు (అకాల మరణం) తొలగుతుందని కూడ చెప్పారు.

**పుష్కర వ్రత విధానము**

గణపతి పూజ, పుణ్యాహవాచన చేసిన తరువాత షోడశదళపద్మరంగవల్లికపై వస్త్రము పరచి దానిపై బియ్యము, దానిపై కలశమును, దానిలో సువర్ణ గౌతమి ప్రతిమను, కలశముపై పచ్చని వస్త్రద్వయమును (2 వస్త్రాలను) ఉంచవలెను.

ఉత్తరంవైపున పుష్కర మండపం ఏర్పాటు చేసి, అందులో పుష్కర ప్రతిమను ఉంచాలి.

తూర్పున గౌతమీ మండపాన్ని, బృహస్పతి మండపాన్ని ప్రతిమలతో ఏర్పాటు చేయాలి.

దక్షిణం వైపున రోజుకు ఒక్కొక్క దేవత చొప్పున జేర్చుకుంటూ ఒక పెద్ద మండపాన్ని ఏర్పాటుచేయాలి. అందులో 1. నారాయణుడు 2. భాస్కరుడు 3. మహాలక్ష్మి 4. గణపతి 5. శ్రీకృష్ణుడు 6. సరస్వతి 7. పార్వతి 8. పరమేశ్వరుడు 9. అనంతుడు 10. నరసింహుడు 11. వామనుడు 12. శ్రీరామచంద్రుడు – వీరిని రోజుకు ఒక్కొక్కరు చొప్పున ఆవాహన చేయాలి.

ప్రతిరోజు స్నాన, తర్పణ, జపములు, కల్పోక్త ప్రకారం అర్చన, దానములు చేయాలి. ఆ విధంగా 12 రోజులు వ్రతము చేసిన తరువాత మంటపాన్ని దానం చేయాలి. యథాశక్తి దక్షిణ కూడా సమర్పించాలి.

**పుష్కరకాలాలలో నిషేధాలు**

పుష్కరకాలాలలో స్త్రీ సంపర్కం, నూనె రాసుకోవడం (తలకు, ఒంటికి), మాంసాహారం, మొదలైనవి నిషిద్ధ కర్మలు. నిషిద్ధమైన కర్మలను చేస్తే పాపం సంభవిస్తుంది.

## గోదావరీ పుష్కర మాహాత్మ్యాన్ని వర్ణించే కథలు

పూర్వము నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు సూతమహామునితో ఆర్యా! మీ వలన అనేక పురాణ విషయములను తెలుసుకొను సందర్భంలో సింహరాశిలో దేవగురువైన బృహస్పతి ప్రవేశించే సమయంలో గోదావరీ పుష్కరములు ప్రారంభమవుతాయని, దాన ధర్మములకు విశేష ఫలములు గలుగుతాయని వినియున్నాము. ఆ పుష్కరాలకు చెందిన సమస్త విషయములను వివరింపవలసినది అని ప్రార్థించారు. అప్పుడు సూతుడు మహర్షులతో ఇట్లు అన్నాడు– పూర్వము నారదమునీంద్రుడు ఇదే ప్రశ్నను బ్రహ్మదేవుని అడిగియుండెను. అప్పుడు బ్రహ్మ పుష్కరము అనే పదానికి ఉన్న అర్థాలన్నింటినీ వివరించాడు. గోదావరీ పుష్కరాల ప్రభావాన్ని వివరించే కొన్ని గాథలను కూడ వివరించాడు.

### రోచిష్మతీ వృత్తాంతము

పూర్వము విదర్భ దేశంలో సుధర్ముడనే రాజు ఉండేవాడు. అతడు తన ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించేవాడు. అతనికి కొంత కాలానికి విదర్భుడు అను పుత్రుడు, రోచిష్మతి అను పుత్రికయు జన్మించారు. అత్యంత సౌందర్యవతియైన రోచిష్మతికి యుక్తవయస్సు రాగానే, తండ్రి

సుధర్ముడు మాహిష్మతీ పురాధీశునికి ఇచ్చి వివాహం జరిపించాడు. శుభ దినము నాటి రాత్రి సర్వాలంకార భూషిత అయిన రోచిష్మతి హంసతూలికా తల్పముపై ఉన్న రాకుమారుని జేరేసరికి అతడు నిర్జీవుడై పడి ఉన్నాడు. అది చూచి ఆమె మూర్ఛిల్లి దుఃఖసాగరములో మునిగింది.

ఆ సమయమున మహానుభావుడయిన అంగీరస మహర్షి రాజదర్శనార్థం రావడం జరిగింది. వికల మనస్కుడయిన రాజు జరిగిన సంఘటనకు కారణమును, దానికి పరిష్కార మార్గమును సూచించవలసిందిగా మహర్షిని ప్రార్థించాడు. రోచిష్మతి యొక్క పూర్వజన్మల వృత్తాంతాన్ని దివ్యదృష్టితో గమనించి అంగీసురుడు సుధర్మునికి ఆ విషయాన్ని చెప్పాడు.

పూర్వకాలములో గౌడ దేశంలో మేఘుడనే వైశ్య ప్రముఖునికి సురూప అనే కన్య కుమార్తెగా జన్మించినది. వివాహ యోగ్య వయస్సు రాగానే ఆ కన్యకు ఒక వైశ్యకుమారునితో వివాహం జరిపించాడు. ఆ నూతన వరుడు వాణిజ్యం నిమిత్తం విదేశాలకు వెళ్ళి, అక్కడ చాలాకాలం ఉన్నాడు. ఈలోగా సురూప, వయసులోని కోర్కెలను అదుపుచేసుకోలేక, వేరొక కులానికి చెందిన యువకునితో అక్రమ సంబంధం ఏర్పరుచుకొంది. భర్త తిరిగి వచ్చిన

తరువాత కూడ, అతనిపై ప్రేమను చూపక, తాను వలచిన యువకునితో కూడి, నగలతో సహా ఇల్లువదలి పారిపోయింది. బంధుజనులకు భయపడి అరణ్య మార్గంలో వెళ్ళగా, వారి నగలను, కొద్దిపాటి సొమ్మును దొంగలు దోచుకున్నారు. చివరకు దగ్గర్లోని ఒక పల్లె జేరి నానా కష్టాలు అనుభవించి కొన్నాళ్ళకు శరీరాలు చాలించారు. తరువాతి జన్మలో ఆమె గుడ్లగూబ అయిపుట్టింది. అనేక జన్మల అనంతరము ఒక వేశ్య కుమార్తిగా జన్మించింది. ఆ జన్మలో అనేకులను ఆకర్షించి ధనము సంపాదించి, దాన ధర్మాలు చేస్తూ ఉండేది.

ఇట్లా ఉండగా సుమేధుడనే బ్రాహ్మణుడు గోదావరీ పుష్కరాల కొరకు తన గ్రామం నుండి బయలుదేరాడు. దారిలో ఒక పట్టణము జేరేసరికి కుంభవృష్టి కురియసాగింది. గత్యంతరము లేక సమీపంలో ఉన్న ఒక భవనమును జేరి అక్కడ ఆ అరుగుపై కూర్చున్నాడు. ఆ భవనము ఆ వేశ్యకు చెందినది. అతని పరిస్థితి చూచి ఆ వేశ్య కొంత జాలిపడి, అతనికి ఫలాహారములను, విశ్రాంతి తీసుకొనుటకు వసతిని ఏర్పాటు చేసింది. ఆ సేవలందుకొని ఆ బ్రాహ్మణుడు మరునాడు ఉదయమే తన దారిన తాను వెళ్ళాడు. ఆ వారకన్య గోదావరి పుష్కరాలకు వెళ్ళుచున్న ఆ బ్రాహ్మణునికి చేసిన సేవా పుణ్యఫలంగా సుధర్మునికి కుమార్తెయై పుట్టింది.

అయితే సురూప వలచిన వేరొక కులపు యువకుడు తరువాత చాల జన్మల వరకు కిరాతుడుగా జన్మించాడు. ఆఖరి కిరాతజన్మలో ఒకసారి జంతువులను, పక్షులను వధించి ఒకచోట విశ్రాంతి తీసుకొనే సమయములో ఎండలో ప్రయాణిస్తూ అలసిపోయి ఉన్న ఒక బ్రాహ్మణుడు అక్కడికే జేరడం జరిగింది. అతని పరిస్థితికి చలించిన బోయవాడు ఆ విప్రుని దాహమును తొలగించడానికి, ఆ బ్రాహ్మణుని తన వీపుపై మోసుకొని, సమీపంలో ఉన్న ఒక జలాశయానికి జేర్చాడు. అతడు అక్కడ తనకు కావలసినన్ని మంచినీరు త్రాగి తనదారిని తాను వెళ్ళిపోయాడు. దాహార్తితో ఉన్న బాటసారికి చేసిన సేవాఫలంగా ఆ కిరాతుడు మరు జన్మలో మాహిష్మతీపుర రాజపుత్రుడుగా జన్మించి, రాజైన సుధర్ముని కి అల్లుడుగా అయ్యాడు. అయితే పుణ్యజన్మంలోని అక్రమ సంబంధ పాప ఫలితంగా, అకాల మరణం చెందాడు. రాకుమార్తెకు కూడా ఆ పాప ఫలంగా తనకు బాల్యమునందే వైధవ్య దుఃఖము కల్గింది.

ఇట్టి సందర్భంలో సుధర్ముని ఇంటికి వచ్చిన అంగీరసముని ఆ రాజు యొక్క ధార్మికతకు మెచ్చి, కారుణ్య దృష్టితో గోదావరి పుష్కరాలకు చెందిన 12 రోజులలోను తాను చేసిన ధర్మకార్యాల మూలంగా లభించిన పుణ్యంలో

2 రోజుల పుణ్యాన్ని రోచిష్మతికి సుమంగళీ విభవము కొరకు ధారపోశాడు. వెంటనే ఆ రోచిష్మతి యొక్క భర్త అయిన రాకుమారుడు నిద్రనుండి లేచినట్లు లేచాడు. అప్పుడు రాజకుటుంబ సభ్యులందరూ అత్యంత ఆనందభరితు లయ్యారు. ఆ మహర్షి ఆ రాజు యెడల అనుగ్రహంతో రాబోయే గోదావరీ పుష్కరాలకు వెళ్ళి, శాస్త్రోక్త కర్మల నాచరింపమని ఆదేశించాడు. సుధర్ముడు ఆ విధంగా చేసి ఈ లోకంలో చాలాకాలం సుఖాలు అనుభవించి చివరకు మోక్షాన్ని అందుకున్నాడు.

**సుమతి యను రాజు కథ**

పూర్వకాలంలో సౌవీరదేశమునకు సుమతి రాజుగా ఉండెను. చాలాకాలము వరకు అతనికి సంతానం లేకపోవుటచే తపస్సు చేసి, ఈశ్వరుని అనుగ్రహంతో ఒక కుమారుని సంతానముగా పొంది, అతనికి చిత్రరథుడు అని పేరు పెట్టెను. విద్యాభ్యాసాదులు పూర్తి కాగానే, అతనికి రాజ్యభారాన్ని అప్పగించి తండ్రియగు సుమతి మోక్షార్థియై అరణ్యాలకు వెళ్ళేడు. గోదావరీ పుష్కర స్నానానికి వెళ్ళుచున్న జాబాలి మహర్షి మార్గమధ్యంలో ఈ రాజును కలిసి, యాత్రార్థము కొంత ధనమును ఇప్పించవలసిందిగా కోరాడు.

అప్పుడు రాజు తన దగ్గర అంత ధనము లేకపోవుటచే, తన కుమారుని పిలిపించి మహర్షికి నమస్కరింపచేసి, ఆ ధనమును ఇప్పిస్తూ, తన పుత్రునికి రాబోవు కాలంలో భాగ్యము, ఆయుర్దాయము ఎట్లుండునో తెలుపమని మహర్షిని కోరాడు. ఆ మహర్షి చిత్రరథుని ఒక్క క్షణము చూచి ఇట్లా అన్నాడు. – ఓ రాజా! నీ కుమారుడు పూర్వజన్మలో సుధర్ముడనే బ్రాహ్మణుని కుమారుడు. తన భార్యయొక్క చెప్పుడు మాటలు విని, తండ్రి ఇంట్లో లేని సమయంలో, తల్లిని ఇంటి నుండి బయటకు వెడలునట్లు చేశాడు. పూర్వం చేసిన పుణ్య విశేషం చేత నీ కుమారుడుగా పుట్టి రాజ్యభోగాలనుభవిస్తున్నాడు. కాని చేసిన పాపకార్యం మూలంగా ఇతని ఆయుష్షు ఇంక 40 రోజులు మాత్రమే ఉంది. అని చెప్పాడు. రాజు చాలా దుఃఖంతో ఈ అకాల మరణాన్ని తొలగించుకొను ఉపాయమును సెలవీయమని ప్రార్థించగా, ఆ మహర్షి, గోదావరీ పుష్కర స్నానమును విధివిధానముగా చేసినచో ఆ దోషము తొలగునని తెల్పెను. తర్వాత రాజు ఇచ్చిన ధనముతో మహర్షి యాత్రను కొనసాగించాడు. చిత్రరథుడు గోదావరీ పుష్కరస్నానము చేసి ఆ దోషమును తొలగించుకొని, దీర్ఘాయుష్మంతుడై చాలాకాలము రాజ్యపాలన చేసి, చివరకు బ్రహ్మలోక ప్రాప్తిని పొందెను.

## గోవింద శర్మ కథ

పూర్వము మాళవదేశంలో గోవిందశర్మయను పండితుడు ఉండేవాడు. అతను సకల విద్యలను అభ్యసించినను, విద్యల యొక్క ప్రయోజనమును తెలుసుకొనలేకపోయి, తనకు విధించబడిన కర్మలను చేయక, నాస్తికుడై, అన్యాయ ధనార్జన చేయుచూ, చివరకు పెద్దపులి వాతపడి మరణించెను.

గోవిందశర్మకు శివశర్మ అను ఒక పుత్రుడు ఉండెను. అతను కూడ వ్యసనములకు లోనై, చెడ్డ మార్గాలకలవాటుపడి, పరస్త్రీ వ్యామోహముతో జీవితాన్ని గడపసాగాడు.

ఇంతలో గోదావరీ నదికి పుష్కరాలు వచ్చేయి. జీవించి ఉన్న తన తల్లి కోరగా, తనకు ఆ పుష్కర నదీ స్నాన ఫలముపై ఏ మాత్రమూ విశ్వాసము లేకున్నను, పుష్కర స్నానానికి వచ్చే తరుణీమణులను చూడవచ్చునను దుష్ట తలంపుతో గోదావరికి వెళ్ళెను. తన తల్లి బ్రతిమాలగా బ్రతిమాలగా, ఇష్టము లేకున్నను, ఎట్లో స్నానం చేసి తండ్రికి శ్రాద్ధక్రియలు చేసెను. శివకర్మ ఇష్టము లేకున్నను చేసిన పిండ ప్రదానం మూలంగా తండ్రియైన గోవిందశర్మకు యమకింకరులు పెట్టు నరక యాతనలు ఏమీ చేయలేకపోయెను. శివకర్మ ఇష్టము లేకున్నను

చేసిన పుణ్యఫల కారణంగా, యమధర్మరాజు గోవిందశర్మను స్వర్గానికి పంపెను.

భక్తి లేకున్నను చేసిన పుష్కర స్నానాదులు అంతటి పుణ్యాన్ని సాధించగా, భక్తిశ్రద్ధలతో చేస్తే వచ్చే పుణ్యాన్ని వర్ణించగలమా?

ఈ విధంగా గోదావరీ పుష్కర మాహాత్మ్యమును నారదునకు బ్రహ్మదేవుడు వివరించెనని శౌనకాది మహర్షులకు సూతమహాముని చెప్పెను.

## పుష్కరాలు మనకు అందించే సందేశం

1. హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం, పసిఫిక్ మహా సముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం మరియు ఆర్కిటిక్ మహాసముద్రం అంటూ భిన్న ప్రదేశాల్లోని నీటిని వేరువేరు పేర్లతో పిలుస్తున్నాం! కాని, నిజానికి ఉన్నది ఒకే ఒక్క జలరాశి. అదేవిధంగా, దైవీశక్తులను రకరకాల రూపాలలో, రకరకాల పేర్లతో మనం పేర్కొంటూ ఉంటాం. కాని ఉన్నది ఒకే ఒక్క పరమాత్మ! భిన్నత్వంలో ఏకత్వం అంటే ఇదే! నదులు మనకు ఈ ఏకత్వ పరమార్థాన్ని బోధిస్తున్నాయి.

2. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు, ద్వారక నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు భిన్న భిన్న సంప్రదాయాలు, భిన్న

భిన్న ఆచార వ్యవహారాలు, ఎన్నెన్నో భేదాలు ఉన్నా, అన్నింటిని ఒకటిగా చేసి చూపించేది మన భారతీయ సంస్కృతి. ఈ ఏకత్వాన్ని సాధించడంలో నదీ పుష్కరాలు అత్యంత ప్రధానమైన పాత్రను పోషిస్తున్నాయి. అదే భారతీయత యొక్క విశిష్టత!

3. నదులు, తాము ఎక్కడ పుట్టినా, ఎన్ని అడ్డంకులు వచ్చినా, నిరంతరం తమ ప్రయాణం కొనసాగిస్తూ, జీవరాశి మనుగడకు సహాయం చేస్తూ, చివరకు సముద్రాన్నిజేరి, అందులోనే కలుస్తున్నాయి.

**"మన జీవితాలలో ఎన్ని ఒడుదుడుకులు సంభవించినా, గమ్యాన్ని మరిచిపోవద్దు. సేవాభావంతో నిత్యం జీవితాలను గడుపుతూ, పరమాత్మ సాన్నిధ్యాన్ని జేరడానికి ప్రయత్నించండి. మనం పవిత్రంగా ఉంటే అందరూ మన దగ్గరకు వస్తారు"** అంటూ నదులు మనకు పరోక్షంగా, అత్యద్భుతమైన సందేశాన్ని ఇస్తున్నాయి.

మన జీవితాలను మన సంస్కృతికి అనుగుణంగా మలచుకొని పుష్కర కార్యక్రమాల్లో సంపూర్ణ భక్తి విశ్వాసాలతో పాల్గొని తరిద్దాం, దైవానుగ్రహాన్ని పొందుదాం!

## క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగివద్దాం !

తీర్థయాత్రలు చేస్తూ ఉంటే ఏర్పడే అలౌకిక తృప్తి మన హృదయాలలో సత్ప్రవర్తననూ, వైరాగ్యాన్ని కల్గించి,మెల్లమెల్లగా పరంధాముని పరమపదం దగ్గరకు తీసుకు వెడుతుంది. అందులో సందేహం లేదు!

పుణ్యం పురుషార్థం అన్నట్లు, తీర్థయాత్రలు, పుష్కరాలు మొదలైనవి సంస్కారాన్ని అందిస్తాయి, సేవాభావాన్ని పెంచుతాయి.

పూర్వం మహర్షులు తీవ్రమైన తపస్సు చేసేవారని కథలు వింటూ ఉంటాము. వారి తపస్సులతో సమానమైన ప్రక్రియను మన మహర్షులు మనకందించారు. పుష్కర స్నానాలు, తీర్థ విధులు ఒక గొప్ప తపస్సు అని వర్ణించారు. శ్రద్ధతో ఆచరించి, మనం తరిద్దాం!

మన ఆఫీసర్ల ఇంట్లోనో, మన బంధువుల ఇంట్లోనో శుభకార్యము ఉందని తెలిస్తే, మనం మన అన్ని పనులనూ ప్రక్కకు పెట్టి, వారిని కలవడానికి తప్పక వెడుతున్నాం! ఇంక, మనం జీవించడానికి అత్యవసరమైన నీటిని ఇచ్చి, అన్నం

పెట్టి, ప్రాణాన్ని నిలబెట్టి రక్షిస్తున్న మన నదులకు పుష్కరాల పండుగలు వచ్చినపుడు, మన కృతజ్ఞతలను తెలుపుకోవడానికి వెళ్ళడం మన కనీస కర్తవ్యం కదా!

**క్షేమంగా వెళ్ళి, లాభంగా తిరిగివద్దాం!!**

– ఇతిశమ్ –

---

**"త్వదీయం వస్తు గోవింద! తుభ్యమేవ సమర్పయే ॥"**

(హే గోవిందా! నీ వస్తువును నీకే సమర్పిస్తున్నాను.)

## అనుబంధం
## పుష్కరస్నాన విధానము

**1.** మొట్టమొదట నదిలో దిగబోవునపుడు ఈ క్రింది మంత్రముతో రేగిపండంత మృత్తికను (మట్టిని) నదిలో మూడుసార్లు వేయవలెను.

**పిప్పలాదాత్సముత్పన్నే కృత్యే లోకభయంకరి ।**
**మృత్తికాం తే మయా దత్తాం ఆహారార్థం ప్రకల్పయ ॥**

2. స్నానమునకు ముందు అనుజ్ఞను తీసికొనుట !

**పావని త్వం జగత్పూజ్యే సర్వతీర్థమయే శుభే ।**
**త్వయి స్నాతుమనుజ్ఞాం మే దేహి గౌతమి పావని ॥**

**సింహంగతే దేవగురౌ పితౄణాం తారణాయ చ ।**
**సర్వపాపవిముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహమ్ ॥**

**తీర్థరాజ నమస్తుభ్యం సర్వలోకైక పావన ।**
**త్వయి స్నానం కరోమ్యద్య భవబంధవిముక్తయే ॥**

3. శ్రీ పుష్కర గౌతమీ స్నాన సంకల్పము

అస్యాం మహానద్యాం సమస్తపాపక్షయార్థం, సింహంగతే దేవగురౌ, సార్ధత్రికోటితీర్థసహిత, తీర్థరాజ సమాగమాఖ్య మహాపర్వణి పుణ్యకాలే పవిత్ర గోదావరీ స్నానమహం కరిష్యే।

(పైవిధంగా చెప్పుకొని మూడుసార్లు స్నానం చేయవలెను.)

4. ధ్యాన శ్లోకములు

**త్వం రాజా సర్వతీర్థానాం త్వమేవ జగతః పితా**
**యాచతో దేహి మే తీర్థం సర్వపాపైః ప్రముచ్యతే ॥**

**గంగాగంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతాని చ ।**
**ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ॥**

**సకృన్నారాయణేత్యుక్త్వా పుమాన్ కల్పశతత్రయం ।**
**గంగాది సర్వతీర్థేభ్యో స్నాతోభవతి పుత్రక ॥**

**మజ్జంతి మునయస్సర్వే భవాని కో న మజ్జతి ।**
**అంబ త్వద్దర్శనాన్ముక్తిః న జానే స్నానజం ఫలమ్ ॥**

**స్వర్గారోహణసోపానమహా పుణ్యతరంగిణి ।**
**అతిక్రూర మహాకాయ కల్పాంత దహనోపమ ।**
**భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతుమర్హసి ॥**

**రేవాతీరే తపః కుర్యాత్ మరణం జాహ్నవీతటే ।**
**దానం దద్యాత్ కురుక్షేత్రే గౌతమ్యాం త్రితయం వరమ్॥**

**పుష్యార్కే జన్మనక్షత్రే వ్యతీపాతే దినత్రయే ।**
**సకృత్ గోదావరీస్నానం కులకోటిం సముద్ధరేత్ ॥**

ఇహ జన్మని యత్పాపం యత్పాపం పూర్వజన్మని ।
తత్సర్వం నాశమాప్నోతి గోదావరి నమోఽస్తుతే ॥
యా గతిర్యోగయుక్తానాం మునీనాం ఊర్ధ్వరేతసాం ।
సా గతిస్సర్వ జంతూనాం గౌతమీతీరవాసినాం ॥
యోఽసౌ సర్వగతో విష్ణుః చిత్స్వరూపీ నిరంజనః ।
స ఏవ ద్రవరూపేణ గంగాంభో నాత్ర సంశయః ॥
నందినీ నలినీ సీతా మాలినీ చ మహాపగా ।
విష్ణుపాదాబ్జసంభూతా గంగా త్రిపథగామినీ ॥
భాగీరథీ భోగవతీ జాహ్నవీ త్రిదశేశ్వరీ ।
ద్వాదశైతాని నామాని యత్ర యత్ర జలాశయే ॥
స్నానకాలే పఠేన్నిత్యం మహాపాతక నాశనమ్ ॥
త్ర్యంబక జటోద్భూతే గౌతమస్యాఘనాశిని ।
సప్తధా సాగరం యాతి గోదావరి నమోఽస్తు తే ॥
దేవగంగే శుభే పుణ్యే గోదావరి నమోఽస్తు తే ।
త్వయి స్నానం కరోమ్యద్య పుష్కరస్య సమాగమే ॥
చతుర్ముఖకరస్థాయీకమండలుజలోద్భవ।
గంగాదిసర్వతీర్థానామధీశ్వర నమోఽస్తు తే ॥
పుష్కరాఖ్య మహాతీర్థ తస్మాత్ స్నానం కరోమ్యహం।
పాహి మాం నరకాద్ఘోరాత్ దేహి స్థానం చ శాశ్వతమ్॥

**సురాచార్య నమస్తుభ్యం సర్వలోకైక పూజిత ।**
**త్వయి సింహగతే దేవ గౌతమ్యాం స్నానమాచరేత్ ॥**

5. ఈ క్రింది సంకల్పమును పఠించవలెను

ఓం కేశవాయస్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయస్వాహా ।

ఓం గోవిందాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం మధుసూదనాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః
ఓం వామనాయ నమః
ఓం శ్రీధరాయ నమః
ఓం హృషీకేశాయ నమః
ఓం పద్మనాభాయ నమః
ఓం దామోదరాయ నమః
ఓం సంకర్షణాయ నమః
ఓం వాసుదేవాయ నమః
ఓం ప్రద్యుమ్నాయ నమః
ఓం అనిరుద్ధాయ నమః
ఓం పురుషోత్తమాయ నమః
ఓం అధోక్షజాయ నమః
ఓం నారసింహాయ నమః
ఓం అచ్యుతాయ నమః
ఓం జనార్దనాయ నమః
ఓం ఉపేంద్రాయ నమః
ఓం హరయే  నమః
ఓం శ్రీకృష్ణాయ నమః
ఓం శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

ఉత్తిష్ఠంతు భూతపిశాచాః ఏతే భూమి భారకాః
ఏతేషామవిరోధేన బ్రహ్మకర్మ సమారభే ।

**ప్రాణానాయమ్య** – ఓం భూః, ఓం భువః, ఓగ్ం సువః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓగ్ం సత్యం, ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి । ధియో యో నః ప్రచోదయాత్॥ ఓమాపో జ్యోతీరసోఽమృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్ ॥

**మహాసంకల్పం** – ఓం మమోపాత్తదురితక్షయద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యబ్రహ్మణః ద్వితీయపరార్ధే శ్వేతవరాహకల్పే వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్యప్రదేశే గంగా గోదావర్యోర్మధ్యదేశే, హరిహరాది సమస్తదేవతా సన్నిధౌ అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ........ నామసంవత్సరే ........అయనే, ......ఋతౌ..... మాసే.... పక్షే.... తిథౌ.... వాసరే, శుభనక్షత్రే, శుభయోగే, శుభకరణే, ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభతిథౌ, శ్రీమాన్....గోత్రః...... నామధేయోఽహం, శ్రీమత.... గోత్రస్య....నామధేయస్య ధర్మపత్నీ సమేతస్య, సకుటుంబస్య లేక, ..... (గోత్రా....నామధేయా అహం సకుటుంబాయాః), మమ ఇహజన్మని, జన్మాంతరేషు చ, బాల్య, కౌమార, యౌవన, వార్ధకేషు, జాగ్రత్స్వప్న సుషుప్త్యాద్యవస్థాసు జ్ఞానతః అజ్ఞానతశ్చ

స్వతః, పరప్రేరణయా వా, సంభావితానాం, సర్వేషాం, పాపానామపనోదనార్థం, సింహంగతే దేవగురౌ సార్ధత్రికోటి తీర్థసహిత పుష్కర ప్రయుక్త మహాపర్వణ పుణ్యకాలే..... దివసే (మొదటి రోజైతే 'ప్రథమదివసే' అనీ, రెండో రోజైతే 'ద్వితీయదివసే' అనీ, అలా ఎన్నవరోజైతే అన్నవరోజుగా చెప్పుకొనవలెను. పిదప) మమ ఉపాత్త దురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం అఖండ చైతన్య సిద్ధ్యర్థం అఘమర్షణ స్నానమహంకరిష్యే.

(పై విధముగా చెప్పుకొని నిలబడి మూడుసార్లు స్నానము చేయవలెను)

**6. ప్రవాహస్నానం**

(నదీ ప్రవాహమునకు ఎదురుగా నిలబడి, ఈ క్రింది శ్లోకమును పఠించవలెను)

**గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।**
**నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥**

శ్రీ పరమేశ్వరప్రీత్యర్థం ప్రవాహస్నానమహం కరిష్యే ।
(మూడుసార్లు స్నానం చేయవలెను)

**7. సూర్యాభిముఖస్నానం**

(సూర్యభగవానునివైపునకు తిరిగి, ఈ క్రింది వాక్యములను పఠించవలెను)

ఓం మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యగర్భ మరీచ్యాదిత్య సవిత్రర్క భాస్కరేభ్యో నమః । పద్మినీ ఛాయా ఉషా సమేత శ్రీ సూర్య నారాయణదేవతాముద్దిశ్య శ్రీ సూర్య నారాయణ దేవతా ప్రీత్యర్థం సూర్యాభిముఖస్నానమహం కరిష్యే। (మూడుసార్లు స్నానము చేయవలెను)

## 8. అర్ఘ్య ప్రదానములు

(క్రింది శ్లోకములను పఠిస్తూ ఆయా దేవతలకు అర్ఘ్యములను ఈయవలెను)

**గంగాదేవికి -**

**విష్ణుపాదాబ్జసంభూతే గంగే త్రిపథగామిని ।**
**గృహాణార్ఘ్యం మయా దత్తం జలే సన్నిహితా భవ ॥**

ఓం గంగాయై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**యమునకు -**

**కాళింది సూర్యతనయే పృథక్ సాగరగామిని ।**
**గృహాణార్ఘ్యం మయాదత్తం యమునే గౌతమీజలే ॥**

ఓం యమునాయై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**సరస్వతీనదికి -**

**దేవి మానససంభూతే సరస్వత్యఘనాశిని।**
**గృహాణార్ఘ్యం మయాదత్తం గౌతమ్యాం సన్నిధిం కురు॥**

ఓం సరస్వత్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**గోదావరీనదికి –**

**త్ర్యంబకజటోద్భూతే గౌతమస్యాఘనాశిని ।**
**సప్తధాబ్ధింగతే గంగే గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**
ఓం గోదావర్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)
**గోవాహన జటాజూట గోమండల సమన్వితే।**
**గోవిందచరణోద్భూతే గోదావరి నమోఽస్తు తే॥**
ఓం గౌతమ్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)
**బ్రహ్మాద్రి శిఖరోద్భూతే గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**
**గౌతమప్రార్థితే గంగే గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**
ఓం గౌతమీ స్వరూపిణ్యై గంగాయై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**బృహస్పతికి –**

**బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవ నమస్కృత।**
**గృహాణార్ఘ్యం మయా దత్తం సింహస్థో భార్యయా సహ**
ఓం తారాసహిత బృహస్పతయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**తీర్థరాజు పుష్కరునకు –**

**తీర్థరాజ మహాభాగ పుష్కరాఘవినాశక।**
**పుష్కరాఖ్య గృహాణార్ఘ్యం సర్వతీర్థాభిపూజిత ॥**

ఓం పుష్కరాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**చతుర్ముఖకరస్థాయికమండలుజలోద్భవ**
**గృహాణార్ఘ్యం మయా దత్తం తీర్థరాజ నమోఽస్తుతే ॥**

ఓం పుష్కరాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**సూర్యనారాయణమూర్తికి –**

**భానో భాస్కర మార్తాండ చండరశ్మి దివాకర ।**
**ఆరోగ్యమాయుర్విజయం శ్రియం పుత్రాంశ్చ దేహి మే॥**

ఓం సూర్యాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**దివాకర నమస్తుభ్యం పాపాజ్ఞానప్రణాశక।**
**త్రయీమయార్క విశ్వాత్మన్ గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**

ఓం దివాకరాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**వినతాతనయో దేవః కర్మసాక్షీ సురేశ్వరః।**
**ఆరోగ్యమాయుర్విజయం శ్రియం పుత్రాంశ్చ దేహి మే॥**

ఓం భాస్కరాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**ఏహి సూర్య సహస్రాంశో తేజోరాశే జగత్పతే।**
**అనుకంపయ మాం దేవ గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**

ఓం మార్తాండాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**లక్ష్మీనారాయణులకు -**

**పుష్కరాక్ష జగన్నాథ లక్ష్మ్యా సహ జనార్దన।**

**అర్ఘ్యం గృహాణ గౌతమ్యాం సింహయుక్తే బృహస్పతే ॥**

ఓం లక్ష్మీ సహిత విష్ణవే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

(అర్ఘ్యమియ్యవలెను)

**పార్వతీపరమేశ్వరులకు -**

**అష్టమూర్తే మహేశాన గంగాధర కృపానిధే।**

**గౌర్యా సహ గృహాణార్ఘ్యం యథోక్త ఫలదో భవ ॥**

ఓం గౌరీ సహిత ఈశానాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

(అర్ఘ్యమియ్యవలెను)

**సరస్వతీ బ్రహ్మలకు -**

**చతుర్భుజ జగత్స్రష్టః సత్యలోకస్థితావ్యయ।**

**సరస్వత్యా చ సహితో గృహాణార్ఘ్యం నమోఽస్తు తే॥**

ఓం సరస్వతీ సహిత బ్రహ్మణే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

**గణపతికి -**

**గణనాథ దయాసింధో, నత విఘ్న వినాశినే ।**

**గృహాణార్ఘ్యం మయాదత్తం, గౌతమ్యాం విబుధార్చిత ॥**

శ్రీ మహాగణపతయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి

(అర్ఘ్యమియ్యవలెను)

**అనంతునకు -**

**అనంత జగదాధార, ఫణసప్తక మండిత ।**

**అర్ఘ్యం గృహాణవరద, వాసుకీంద్ర నమోஉస్తుతే॥**

శ్రీ అనంతాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**నృసింహునకు -**

**ప్రహ్లాద వరదానంత, నృసింహ జగదీశ్వర ।**

**అర్ఘ్యం గృహాణ వరద, సర్వలోకేశ్వరేశ్వర ॥**

శ్రీ నారసింహాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**వామనునకు -**

**అదితేర్గర్భసంభూత, బలిబంధన కారణ ।**

**అర్ఘ్యం మయార్పితం దేవ, గృహాణ జగదీశ్వర ॥**

శ్రీ వామనమూర్తయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**నమోஉస్తు రామచంద్రాయ, వైదేహీవల్లభాయ చ ।**

**అర్ఘ్యం మయార్పితం దేవ, గృహాణ జగదీశ్వర ॥**

శ్రీరామాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**శ్రీకృష్ణునకు -**

**వాసుదేవ దయాసింధో, గోపీజనమనోహర ।**

**గృహాణార్ఘ్యం మయా దత్తం, కృష్ణ విష్ణో జనార్దన ॥**

శ్రీకృష్ణాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి (అర్ఘ్యమియ్యవలెను)

**ఇంద్రాది దేవతలకు -**

**ఇంద్రాద్యా వసవో రుద్రాస్సాధ్యా విశ్వే తథాఽశ్వినౌ।**
**సానుగాశ్చ సురాస్సర్వే గృహ్ణంత్వర్ఘ్యం మయోజ్ఝితమ్॥**
ఓం ఇంద్రాది దేవతాభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**వాలఖిల్యాది మహర్షులకు -**

**మునయో వాలఖిల్యాద్యాః సర్వే చైవ మహర్షయః।**
**సింహస్థితే గురౌ సర్వే గృహ్ణంత్వర్ఘ్యం మయార్పితమ్॥**
ఓం వాలఖిల్యాది ఋషిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**సప్తర్షులకు -**

**కశ్యపోఽత్రిర్భరద్వాజో విశ్వామిత్రోఽథ గౌతమః ।**
**వసిష్ఠో జమదగ్నిశ్చ సప్తైతే ఋషయస్తథా ॥**
కశ్యపాది సప్తర్షిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**అరుంధతికి -**

**అరుంధతి మహాదేవి వసిష్ఠప్రియభామిని ।**
**దాంపత్యరక్షణార్థాయ ఇదమర్ఘ్యం దదామ్యహమ్ ॥**
అరుంధత్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి. (అర్ఘ్యమియ్యవలెను)

**సనక సనందనాదులకు -**

**సనకాద్యాస్తథా సింధుః కపిలాద్యా మహౌజసః।**
**తే గృహ్ణంతు మయాదత్తమర్ఘ్యం సింహగతే గురౌ ॥**
సనకాదిభ్యో మహద్భ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**పితృదేవతాగణమునకు -**

**అగ్నిష్వాత్తా బర్హిషదః కవ్యవాహనచార్యమాః।**
**ఆజ్యపాః పితరస్త్వర్ఘ్యం గృహ్ణంత్వపిచ సోమపాః ॥**
ఓం అగ్నిష్వాత్తాది పితృభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.
(అర్ఘ్యమియ్యవలెను)

**9. పితృదేవతలకు తర్పణములు -**

**అసంస్కారాశ్చ యే కేచిజ్జలాశాః పితరో మమ।**
**తేషామాప్యాయనార్థాయ దీయతే సలిలం మయా॥**
(అని దక్షిణంవైపునకు తిరిగి తర్పణములను ఇయ్యవలెను)

**యే కే చాస్మత్కులే జాతాః అపుత్రాః గోత్రిణో మృతాః।**
**తే గృహ్ణంతు మయా దత్తం వస్త్ర నిష్పీడనోదకం॥**
(అని వస్త్రమును పిండి నీరు వదలవలెను)

**యే కే చాస్మత్కులే జాతాః అపుత్రాః గోత్రిణో మృతాః।**
**తే గహ్ణంతు మయా దత్తం సూత్రనిష్పీడనోదకం॥**
(అని జందెమును పిండి నీరు వదలవలెను)

**తీర్థము తీసుకొనుట –**

**అకాల మృత్యుహరణం సర్వవ్యాధి నివారణమ్ ।**
**సమస్త పాప క్షయకరం శ్రీ మహావిష్ణు పాదోదకం పావనం శుభమ్ ॥**

గోదావరీ నదిలోని నీటిని మూడుసార్లు తీర్థముగా గ్రహించవలెను.

## 10. యక్ష్మ తర్పణము (యక్ష్మాధిపతికి/రుద్రునకు)

గట్టు వద్దకు వచ్చి, నీళ్ళలోనే నిలచి, ఈ క్రింది మంత్రముతో కట్టుకున్న వస్త్రము నీళ్ళను ఒడ్డుమీద మూడుమార్లు వదలిపెట్టవలయును.

**యన్మయా దూషితం తోయం శారీరమలసంయుతమ్ ।**
**తస్మాత్పాపవిశుద్ధ్యర్థం యక్ష్మాణం తర్పయామ్యహమ్ ।**

**11. సూర్యధ్యానము -**

గట్టుపైకి వచ్చి, పొడిబట్టలు (పట్టు వస్త్రములు) కట్టుకొని సూర్యధ్యానము చేసుకొనవలెను.

**ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ**
**నారాయణస్సరసిజాసనసన్నివిష్టః ।**
**కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ**
**హరిర్ హిరణ్మయవపుః ధృతశంఖచక్రః॥**

**హరిః ఓమ్ ॥**

## ఉపయుక్త వ్యాసాల రచయితలు

1. తూములూరి లక్ష్మీనారాయణగారు
2. శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి శాస్త్రి గారు
3. డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య గారు
4. శ్రీ యం. బాలవిశ్వనాథశర్మ గారు
5. శ్రీమద్భాగవతం లక్ష్మీ నరసింహాచార్యులు గారు
6. డా॥ ఎస్.బి. రఘునాథాచార్య గారు
7. ఆచార్య దివాకర్ల వెంకటావధాని గారు
8. డా॥ ప్రసాదరాయ కులపతి గారు
9. శ్రీ చెరుకుపల్లి జమదగ్ని శర్మ గారు
10. శ్రీ డి.ఎల్. ఆచార్య గారు
11. డా॥ శలాక రఘునాథశర్మ గారు
12. శ్రీ మురళి – దుర్గ గారు
13. శ్రీ వంగల రామకృష్ణ శాస్త్రి గారు
14. శ్రీ వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు గారు
15. శ్రీ నోరి భోగేశ్వరశర్మగారు

## శ్రీ వేదభారతి

## ఇంతవరకు సాధించిన కొన్ని ఘన విజయాలు

1. గత 20 సంవత్సరాలలో శ్రీ వేదభారతి అనేక అంశాలలో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, ప్రతిభను చాటుకొని, రాష్ట్రపతులు, ప్రధానమంత్రి మొదలైన ప్రముఖుల మన్ననలను పొందగల్గినది. వివరాలను శ్రీ వేదభారతి వెబ్‌సైట్ (www.shrivedabharathi.in) ద్వారా గమనించగలరు.
2. **వేదపరిరక్షణ :** ఇప్పటివరకు సుమారు 1200 గంటల స్టూడియో రికార్డింగ్ ద్వారా వేదమాతకు చెందిన కొన్ని అపూర్వ పఠన పద్ధతులను సి.డి./డి.వి.డి.ల రూపంలో సాకారంగా పొందగలిగే అదృష్టం లభించింది.
3. **వేదగణిత ప్రచారం :** పోటీ పరీక్షలలో పాల్గొనే విద్యార్థులకు, యువతకు ప్రత్యక్షంగా ఉపయోగించే ''వేదగణితం'', ''వేదవిజ్ఞానం'' వంటి అనేక విషయాలను వందలాది ఎపిసోడ్స్ రూపంలో టి.వి. ఛానళ్ళ ద్వారా, పుస్తకాల ద్వారా, డి.వి.డి.ల ద్వారా లక్షలాది మందికి అందించడం జరిగింది. ప్రభుత్వం నుండి **"బంగారు నంది"** పురస్కారం లభించింది.

4. **బ్రెయిలీ లిపిలో వేదగణితం :** పోటీ పరీక్షలలో పాల్గొనుటకు ఉత్సాహము ఉన్ననూ, కంటిచూపులోపము కారణంగా గణితమును నేర్చుకొనుటకు కష్టపడుచున్న **అంధ విద్యార్థులకు,** యువతకు సహాయకారిగా ఉండుటకు, శ్రీ వేదభారతి **సామాజిక బాధ్యతను కారుణ్యదృష్టితో స్వీకరించి, ప్రపంచంలో మొట్టమొదటి సారిగా, వేదగణితమును బ్రెయిలీ లిపిలో ముద్రించినదని తెలుపుటకు సంతోషిస్తున్నాము.**

5. భారతీయ గణితశాస్త్ర చరిత్ర – గత 5 వేల సంవత్సరాలకు పైగా వ్యాప్తి చెందిన మన భారతీయ గణితాన్ని పెంచి పెద్దది చేసిన మన మహర్షుల గురించి, శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవడం మన కర్తవ్యం. మొదటి సంపుటం 1000 పైగా పేజీలతో ముద్రితమైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

6. **"వేదో రక్షతి రక్షితః" (వేదాన్ని రక్షిస్తే ఆ వేదమే మనలను రక్షిస్తుంది) అనే వచనాన్ని గుర్తుచేసుకుంటూ, వేదమాతను పరిరక్షించుకొనే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన వలసినదిగా ప్రార్థన.**

**9849459316**

# శ్రీ వేదభారతి (రిజిష్టర్డ్–1994)

(వేదశాస్త్రాల పరిరక్షణకు, సంస్కృత ప్రచారానికి అంకితమైన ధార్మికసంస్థ)


**కార్యాలయం :** "హెచ్" బ్లాక్–34, మధురానగర్, హైదరాబాద్–038.

దూరవాణి – **98494 59316**

Website : www.shrivedabharathi.in; E-mail : shrivedabharathi@gmail.com


## శ్రీ వేదభారతి ప్రచురణలు (తెలుగు)

1. వేదగణితం, లీలావతీగణితం, పావులూరి గణితం
2. భారతీయ గణితశాస్త్ర చరిత్ర (జ్యోతిశ్శాస్త్ర విభాగం)
3. శ్రీ దుర్గాసప్తశతీ (చండీ) హోమవిధానం
4. శ్రీ సహస్రలింగార్చన పూజావిధానము
5. ఉపనిషద్రత్నావళి – 4 సంపుటాలు
6. షడ్దర్శనాలు
7. రామాయణ, భారత, భాగవతాల్లో జ్యోతిశ్శాస్త్ర విశేషాలు
8. మన సమస్యలు – పరిష్కారాలకు వేదమంత్రాలు
9. జ్యోతిశ్శాస్త్రసహాయంతో భూకంపాలను ముందుగా పసిగట్టగలమా?
10. వైఖానసాగమ సంక్షిప్త పరిచయం
11. అతిరాత్ర మహాయాగ సంక్షిప్త పరిచయం
12. గోదావరీ పుష్కరాల సంక్షిప్త పరిచయం
13. వేదశాస్త్రాల సంక్షిప్త పరిచయం

14. ఉపనిషత్తుల సంక్షిప్త పరిచయం
15. భగవద్గీత సంక్షిప్త పరిచయం
16. ఉపనయన సంస్కార సంక్షిప్త పరిచయం
17. వివాహ సంస్కార సంక్షిప్త పరిచయం
18. ఆదిశంకరాచార్య (జీవిత చరిత్ర, సిద్ధాంతం-సంక్షిప్తంగా)
19. భగవద్రామానుజాచార్య(జీవితచరిత్ర, సిద్ధాంతం-సంక్షిప్తంగా)
20. మధ్వాచార్య (జీవిత చరిత్ర, సిద్ధాంతం-సంక్షిప్తంగా)
21. "వేదవేద్య" శ్రీ వినాయక సహస్రనామావళి (పూజావిధానంతో)
22. వేదగణితం (బ్రెయిలీ లిపిలో తెలుగు, ఇంగ్లీషు)
(ఆడియో సి.డి.తో కూడా) అంధ విద్యార్థులకు/యువతకు
23. కృష్ణయజుర్వేద (తైత్తిరీయశాఖ) వైభవము

## ENGLISH

24. Vedic Mathmatics, Lilavathi Ganitham & Paavuluri Ganitham
25. Science and Technology in Vedas and Sastras
26. Vedas and Computers (Computers Science in Vedas)
27. Upanishad Ratnavali (11 Upanishads) Set of 4 Books
28. Heritage Education (A brief study of Vedas & Sastras)
29. A Brief Introduction of Vedas and Sastras
30. The Splendour of Krishna Yajurveda - A Monograph

## శ్రీ వేదభారతి ప్రచురణలు (సి.డి.లు / డి.వి.డి.లు)

1. వేదగణితం (ఇంగ్లీషు)
   2 డి.వి.డి.లు (వీడియో) 57 పాఠాలు
2. వేదగణితం (తెలుగు)
   3 డి.వి.డి.లు (వీడియో) 57 పాఠాలు
3. సంపూర్ణ ఋగ్వేద సంహిత (64 అధ్యాయాలు)–ప్రతి అధ్యాయానికి ఇంగ్లీషులో పరిచయ వచనాలతో
   ఋగ్వేద సంహిత – మూలపాఠం – 1 డి.వి.డి. (mp3)
4. ఋగ్వేద సంహిత – పదపాఠం – 1 డి.వి.డి. (mp3)
5. ఋగ్వేద సంహిత – క్రమపాఠం – 1 డి.వి.డి. (mp3)
6. ఋగ్వేద సంహిత – శిఖపాఠం – 2 డి.వి.డి.లు (mp3)
6. ఋగ్వేదం–బ్రాహ్మణము, ఆరణ్యకము, ఐతరేయోపనిషత్, బృహదారణ్యకోపనిషత్తు–1 డి.వి.డి. (mp3)
7. ఋగ్వేదం–11 రకాల పాఠాలు–మొదటి 1,2,3 అధ్యాయాలు 2 డి.వి.డి.లు(mp3) (మూలం(సంహిత), పదం, క్రమ, జట,మాల,శిఖ, రేఖ, ధ్వజ, దండ, రథ, ఘన.)
8. అభిషేక మంత్రాలు – నమకం, చమకం, పురుషసూక్తం, శ్రీసూక్తం, మన్యుసూక్తం, మంత్రపుష్పం, లఘున్యాసం, మహన్యాసం, గ్రహశాంతి, నక్షత్రశాంతి, అరుణం.
   ఉపనిషత్తులు–ఈశ, కఠ, మాండూక్య, ఐతరేయ, తైత్తిరీయ (శీక్షావల్లి,ఆనందవల్లి, భృగువల్లి, మహానారాయణం) 1 సి.డి. (mp3)

9. కామ్యమంత్రాలు-1 సి.డి.(mp3) సమస్యల పరిష్కారానికి గుర్తించబడిన మంత్రాల పఠనం (జాబితా వెబ్‌సైట్‌లో ఉంది)

10. కృష్ణయజుర్వేదం (తైత్తిరీయము) - (పాక్షికం) 1వ కాండలోని 1వ పన్నం-5 పఠన పద్ధతులు (మూలం, పదం, క్రమ, జట, ఘన), 3వ కాండలోని 1,2 పన్నాలు (మూలం) - 1 సి.డి. (mp3)

11. బ్రహ్మసూత్ర శాంకరభాష్య పాఠములు - (మహామహోపాధ్యాయ, ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారిచే) 2 డి.వి.డి.లు (mp3)

12. వేదసంరక్ష - 1 డి.వి.డి. (వీడియో) -
   - i) వేదశబ్ద పరిరక్షణ ఆవశ్యకత (ఇంగ్లీషులోను, తెలుగులోను)
   - ii) ఋగ్వేదం - 11 రకాల పఠన పద్ధతుల ఉదాహరణలు
   - iii) కొన్ని వేదమంత్రాల సచిత్ర పఠనము
   - iv) జ్యోతిర్లింగక్షేత్రాల దర్శనం

మరిన్ని వివరములకు క్రింది వెబ్‌సైట్‌లో చూడగలరు

www.shrivedabharathi.in

---

గమనిక - పూజా టి.వి. ద్వారా

**డా॥ రేమెళ్ళ అవధానులు** గారు

మరియొకసారి వేదగణితాన్ని ఎపిసోడ్స్ రూపంలో మీ ముందుకు వస్తున్నారు.